క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన



దొరగూడలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, నేతలు

ముంచంగిపుట్టు: గిరిజన పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వ పాలనను చేస్తోందని వనుగుమ్మ సర్పంచు కిరసాని మిల్కి అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ దొరగూడ గ్రామంలో మంగళవారం జెడ్పీ నిధులు రూ.10లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ మిల్కి, మండల వైఎస్సార్‌సీపీ నేతలు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మిల్కి మాట్లాడుతూ ప్రభుత్వం పాలనలో గిరిజన గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ప్రత్యేక చొరవతో సీసీ రోడ్లుకు నిధులు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ పక్షాన గిరిజనులు ఉంటారన్నారు. ఉప సర్పంచ్ సీతారాం, నేతలు ,గ్రామ వలంటీర్ల పాల్గొన్నారు.

గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఘటాల ఊరేగింపు

డుంబ్రిగుడ: మండలంలోని గంగమ్మ దేవత పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘటాలను ఊరేగించి, అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఎరుకునాయుడు గ్రామ సావడిలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో సందడి నెలకొంది.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాలదేవ్

అరకులోయ రూరల్: మండలంలో బొండం పంచాయతీ కొత్తవలస గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటపాటలతో పాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయలు పరిరక్షించుకునేందుకు గ్రామల్లో అన్ని రకాల పండుగలు నిర్వహించి యువతను చైతన్యపరచాలన్నారు. గిరిజన సంఘం నాయకులు నాన్నిబాబు, జోగులు, కృష్ణ, మత్స్యరాజు, జయరాం పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

అనకాపల్లి : దేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, నేటి యువత సంప్రదాయాలను కొనసాగించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. స్థానిక రావుగోపాలరావు రహదారి ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి డాక్టర్ కొణతాల రామలింగ స్వామి పురస్కార్–2024 ప్రదానోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలుగుభాష గొప్పతనం గురించి ఆయన వివరించారు. నగదుతో కొనేవాటిని సుఖాలని, నగదుతో కొనలేనిది ఆనందం ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో తెలుగుభాషకు ఎంతో తియ్యదనం ఉందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త కొణతాల రామలింగస్వామి ట్రస్ట్ పేరుమీద తెలంగాణ, ఏపీ రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వ్యక్తులకు అవార్డులతో అభినందించడం శుభపరిణామమన్నారు. ఉపాధ్యాయ రంగంలో శ్రీనివాసరావుకు, ఉత్తమ విద్యార్థి రంగంలో భార్గవ్, సంఘం సేవకులకు పి.సత్య తిరుపతిరావు పట్నాయక్, జగదీష్‌కుమార్, రాజేష్, రవితేజ, తరుణ్‌కుమార్ అవార్డులో లక్ష్మీప్రసాద్ సత్కరించారు. అంతకు ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు



కిల్లంకోటలోని పండగ వేడుకలో వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గం సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, నాయకులు



బలమానుశంకలో భజన కార్యక్రమంలో భక్తులు



హుకుంపేటలో అల్లూరి వేషధారణలో సందడి

అంబరాన్నంటిన పండగ సంబరాలు

- ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు
- గ్రామల్లో సందడి
- ఆకట్టుకున్న రంగవల్లులు



పెద్దూరు గ్రామంలోని థింసా నృత్యాలు చేస్తున్న గిరిజనులు, పర్యాటకులు

అనంతగిరి: అల్లూరి జిల్లాలో భోగి, సంక్రాంతి, కనుమ సంబరాలు మిన్నంటాయి. గ్రామాలన్నీ జనం రాకతో కళకళలాడాయి. పల్లె తల్లి మురిసిపోయింది. ప్రతి ఇంటి మామిడితోరణాలు, ప్రత్యేకాలంకరణతో గుమ్మాళ్లు, వాకిళ్ల ముందు గొబ్బెమ్మెళ్లతో దర్శనమిచ్చాయి. వీధులన్నీ అందమైన ముగ్గులతో అందంగా కనిపించాయి. కొత్త అల్లుళ్ల ,బంధు, మిత్రుల రాకలతో ఇళ్లన్నీ కళకళలాడాయి. పండగ ఆనందం వెల్లివిరిసింది. పిండి వంటల ఘుమఘుమలాడాయి. ఇంటిల్లిపాది కొత్త దుస్తులు ధరించి, సంప్రదాయ పద్ధతిలో పండగ పూజలు చేశారు. యువత, చిన్నారుల సందడి కనిపించింది. మన్యంలోని సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో కిటకిటలాడాయి. థింసా నృత్యాలతో గిరిజనులు, పర్యాటకులు సందడి చేశారు. కనుమ రోజును గోవులను ప్రత్యేకంగా అలంకరించి పూజలుచేశారు. మండలంలోని పెద్దూరులో పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామపెద్దలు సోమర, దోనేష్, అద్దునాయుడు, రాంనాయుడు, రామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయితీలో గిరిజన గ్రామాల్లో సంక్రాంతి పండుగ ఘనంగా జరిగింది.గిరిజన మహిళాలు వాకిట్లో రంగురంగులతో ముగ్గులు వేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వస్త్రాలు ధరించి డప్పు వాయిద్యలతో థింసా నృత్యాలు చేశారు.గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.యువత డిజే స్టెప్పులతో సందడి చేశారు.మహిళాలకు పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, బహూమతులు అందజేశారు.

దుంబ్రిగుడ: మండలంలోని గిరిజన గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందడి చేశారు. గ్రామాల్లో మహిళలు థింసా నృత్యాలు చేశారు.

హుకుంపేట: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సంక్రాంతి పండగ ఘనంగా జరుపుకున్నారు.పలు ప్రాంతాల్లో బుడియాలు సందడి చేశారు. అల్లూరి సీతారామరాజు, మన్యం దొర వేషధారణతో ఆకట్టుకున్నారు. కొంతిలిలో సర్పంచ్ రేగం రమేష్ ఆధ్వర్యంలో పండగ వేడుకలు జరిగాయి.

జి.మాడుగుల: ఏజెన్సీ గిరిజన గూడేల్లో సోమవారం నుంచి సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ ఇంటింటా భజన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో వంజరి, గెమ్మెలి, గడుతూరు, పెదలోచలి, సొలభం, జి.మాడుగుల, సింగర్భ తదితర పంచాయతీల్లో పలు గ్రామాల్లో పండగ వేడుకలు ఘనంగా జరిపారు.పాడి పంటలు వృద్ధి చెందాలని రైతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గోవులను అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామాల్లో విచిత్ర వేషధారణలతో ×సేర్ బుడియా× సందడితో గూడెలు జనాలతో కళకళలాడుతున్నాయి. కిల్లంకోట పంచాయతీ కేంద్రంలో మంగళవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సందడి చేశారు. గ్రామంలో పెద్దలతో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో సమస్యలు, ఇబ్బందులు గుర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. తన సొంత గ్రామమైన కిల్లంకోటలోగిరిజన సాంప్రదాయ ప్రకారం గోమాతకు పూజలు చేసి, పులగాం అందించారు. గెమ్మెలి సర్పంచ్ సీదరి కొండబాబు, బొయితిలి మాజీ సర్పంచ్ తమర్భ రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కొత్తు దుస్తులు ధరించి ఒకరికి ఒకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గంగవరం : మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఐక్య కోయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాల్ వీధిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు మాజీ ఎంపీపీ తీగలప్రభ, సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, బీజేపీ మహిళా కార్యదర్శి గంగాభవానీ, ఆదివాసీ జేఏసీ సభ్యుడు సిద్దూ తదితరులు బహుమతులు అందచేశారు. ఉపాధ్యాయులు వనిత, రాంబాబుదొర తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న గ్రామస్తురాలు మడకం దేవి ఆధ్వర్యంలో పెదగార్లపాడులో రెండు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మ్యూజికల్ చైర్, ,లెమన్ స్పూన్ ఆట, పరుగు పందెం ఆట, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు సంబరాల్లో పాల్గొన్నారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు బుజ్జి దొర, కృష్ణ, మాజీ సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

వీఆర్ పురం: సంక్రాంతి పండగను పురష్కరించుకొని గ్రామాల్లో సందడి నెలకొంది. గ్రామాల్లో డూడూ బసవన్నల సందడి. వాకిళ్లలో సుందరంగా తీర్చిదిద్దిన రంగవల్లులు విశేషంగా ఆకట్టుకున్నాయి. గంగిరెద్దుల్లో, డూడూ బసవన్నల సందడి నెలకొంది. గ్రామస్తులు దానం చేసిన ధాన్యం, నగదులను స్వీకరించి ఆశీర్వదించారు.



ముంచంగిపుట్టులో ఇంటి ముంగిట అందమైన ముగ్గు



వీఆర్ పురంలో సందడి చేస్తున్న డూడూ బసవన్న



ఇంటి ముందు తీర్చిదిద్దిన ముగ్గు వద్ద చిన్నారి



గంగవరంలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ అక్కమ్మ



పెదగార్లపాడులో ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు

సందడిగా తీర్థాలు..



కె.జె.పురంలో పరదేశమ్మను దర్శించుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



దేవరాపల్లిలో గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: సంక్రాంతి నుంచి మహా శివ రాత్రి వరకు గ్రామాల్లో తీర్థాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం కె.జె.పురంలో పరిదేశమ్మ తీర్థం సందర్భంగా అమ్మవారిని చుట్టు పక్కల గ్రామాల భక్తులు పూజలు చేశారు. చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేగి వారి తోడపెద్దు సేవగరిడీ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం ముత్యమాంబ తీర్థం నిర్వహించారు.

రావికమతం: గంపవానిపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా ఇరు పార్టీల నాయకులు విడివిడిగా నిర్వహించే ఈ ఉత్సవం ఈ ఏడాది ఉమ్మడిగా నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి ఒక్కో రకం మిఠాయితో ఘనంగా సారె ఊరేగింపు చేసి గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవం జరిగింది. చినపాచిల, గుడ్డిపలో రామకోవెల ఉత్సవాలను ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది.

మాడుగుల: సత్యవరంలో రాములవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తప్పెడగుళ్లు, తాళాలతో భజనలు చేశారు. మహిళల కోలాటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలనాటి సంప్రదాయం ప్రకారం తీర్థం నిర్వహించారు.

ఎస్.జి.నగరం నారితల్లమ్మ తీర్థం నేడు

దేవరాపల్లి: ఎస్.జి.నగరంలో బుధవారం నారితల్లమ్మ తీర్థం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవ గోడపత్రికలను సోమవారం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆవిష్కరించారు. జిల్లా స్థాయి ఎడ్ల బండ్లబళ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చిరికి జగన్నాథరావు, చిరికి శ్రీనివాసరావు, వంటాకు శ్రీనివాసరావు, రొంగలి సింహాచలంనాయుడు, చిరికి వెంకటరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు ప్రదర్శన

కె.కోటపాడు: గొండుపాలెంలో దండుముత్యాలమ్మ తీర్థాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందేలు నిర్వహిస్తామన్నారు. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున పురస్కారాన్ని అందిస్తామన్నారు.

దేవరాపల్లి: తారువ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం మర్లమాంబ తీర్థం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరించి, తెల్లవార జాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవరాపల్లిలో అప్పలమ్మ పేరంటాల తీర్థం ఘనంగా జరిగింది. సంప్రదాయ బద్ధంగా పేరంటాలు వద్దకు గ్రామస్తులంతా భారీ ఊరేగింపుగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, పరవాడ రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సందడిగా వీరన్న తీర్థం

అనకాపల్లి : చినమాకవరం గ్రామంలో కోరుకొండపై వెలసి ఉన్న వీరాస్వామి(వీరన్న)తీర్థం మంగళవారం సాయంత్రం కనుల పండువలా జరిగింది. మాకవరం, మార్టూరు, మామిడిపాలెం, కొండుపాలెం, సీహెచ్.ఎన్.అగ్రహారం, రేబాక పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పొలాల గట్ల మీదుగా కోరుకొండకు చేరుకుని మెట్ల మార్గం లేకపోయినా ఇనుపగొట్టాల ఆసరాతో కొండ ఎక్కారు. చిన్నారులు, మహిళలు, మృద్ధులు, యువకులు, కొత్తగా పెళ్లయిన దంపతులు పెద్ద ఎత్తున ఉదయం నుంచే వీరాస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి గుడి నుంచి విసిరే అరటి పళ్లు, కొబ్బరి చెక్కలను పట్టుకొని ప్రసాదంగా భక్తులు స్వీకరించారు. కొండ దిగువన స్వామివారి తీర్థం జరిగింది. పంచదార చిలుకలు, చిన్నపిల్లల ఆట వస్తువులు విక్రయాలు జోరుగా సాగాయి.

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం బంగారు మెట్టలో అచ్చమ్మ పేరంటాలు, పొట్టిదొరపాలెంలో రామాలయం తీర్థాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ రెండు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బంగారుమెట్టలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందించారు. కనుమ సందర్భంగా రైతులు తమ జీవనాధారం, ఇష్టదైవాలుగా భావించే పశువులకు పూజలు చేశారు. కొత్తకోట శివాలయంలో ఆలయ చైర్మన్ గుమ్ముడు దొరబాబు దంపతులు పూజించారు. రోలుగుంట మండలం అడ్డరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తారపు రామానాయుడు, ఇల్లపు గోవింద జ్ఞాపకార్థంగా వారి కుటుంబాల ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

నాతవరం: మండలంలో మకర సంక్రాంతి పండగ ఉత్సవాలు వాడ వాడలా ఘనంగా జరుపుకున్నారు. భజనలు చిన్నారులచే కోలాటం ముగ్గులు పోటీలు వంటికార్యక్రమాలు నిర్వహించారు.



రావికమతంలోని సారె ఊరేగింపులో భక్తులు



చినమాకవరంలో తీర్థానికి వచ్చిన గ్రామస్తులు



బుచ్చెయ్యపేట మండలంలోని బంగారుమెట్టలో ఎడ్ల బళ్ల పరుగు పందెం



నాతవరంలో చిన్నారుల కోలాటం

రగ్గుల పంపిణీ



వంతమర్రి గ్రామంలో రగ్గులు పంపిణీ చేస్తున్న దాత సత్యనారాయణ



పేగ గ్రామంలో రగ్గులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంద్రయ్య

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ వంతమర్రిలో రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ సంక్రాంతి సందర్భంగా సోమవారం 50 మంది వృద్ధులకు రగ్గులు, జంబుఖానాలు పంపిణీ చేశారు. చలి నుంచి పేదలు రక్షణ పొందేందుకు ఈ రగ్గులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావాలని, మారుమూల ప్రాంతాల పేద విద్యార్థులను తమ వంతు ఆదుకోవాలని కోరారు. ఆయన విద్య ప్రాముఖ్యతను వివరించారు. డి.రామకృష్ణ, ప్రియాంక,వెంకయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: హైదరాబాద్‌కు చెందిన సమరిటన్స్ ఫర్ ద నేషన్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పేగలో మంగళవారం గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. పేగ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 800 కుటుంబాలకు సర్పంచ్ పాయం చంద్రయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ రాం కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పీసం పొదయ్య, బజారు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

డొంకాడలో గంగమ్మతల్లి జాతర



డొంకాడలో తీర్థ మహోత్సవం

నక్కపల్లి: సంక్రాంతి పండగ అంటే తిరునాళ్ల జాతరే.. గ్రామ గ్రామాన వారి వారి ఆచార వ్యవ హారాల ప్రకారం తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తారు. పల్లెలు సాంస్కృతిక కార్యక్రమాల సందడితో పాటు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. మండలంలోని డొంకాడ లో కనుమ పండగను పురష్కరించుకుని గ్రామ దేవత గంగమ్మతల్లి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో చిన్నారులు సందడి చేయ గా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీనివాసుడు, అలిమేలు మంగమ్మ, పద్మావతి అవతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

మునగపాక : మండల కేంద్రంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. మేలతాళాలతో పాటు పూలమాలలు వేసి స్వామిని వీధుల గుండా ఊరేగించారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి : విజయవాడలో ఈ నెల 19న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎ.జె.చిన్నకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, స్థానిక ప్రజలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఊరూరా తిరునాళ్లు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రాంబిల్లి : సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా మండలంలో తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సంధర్భంగా సోమవారం దిమిలిలో సంతోషిమాత, లోవపాలెంలో పరశురామన్న తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కట్టుబోలులో కనుమ పండగ సందర్భంగా మంగళవారం బాల సన్యాసమ్మ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ, బంధు మిత్రులతో కలిసి తీర్థాల్లో జనం సందడి చేశారు. రంగుల రాట్నాలు ఎక్కి ముచ్చట తీర్చుకున్నారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు చేస్తూ తీర్థాల్లో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. ముగ్గులు, ఆటలు , పాటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



కట్టుబోలులో బాల సన్యాసమ్మకు పూజలు